జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజలకోసం

కరీంనగర్

జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి

బుధవారం | 14 | అక్టోబర్ | 2026 పేజీలు 10





## బతుకమ్మ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఉత్సవాలు
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

2




# కొండగట్టులో వ్యర్థాల కంపు

- దుర్వాసనతో ప్రయాణికుల అవస్థలు
- చికెన్, సెప్టిక్ వ్యర్థాలు రోడ్డుపైనే
- అంటువ్యాధుల భయం
- కుక్కల సంచారం.. ప్రయాణికులకు ముప్పు
- అధికారుల పర్యవేక్షణ ఏదీ?

మండలంలోని దొంగలమర్రి నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టుకు వెళ్లే ప్రధాన మార్గం అపరిశుభ్రతకు నిలయంగా మారుతోంది. రహదారి పక్కన చికెన్ వ్యర్థాలతో పాటు మరుగుదొడ్ల సెప్టిక్ ట్యాంకర్ల వ్యర్థాలను కూడా పారబోస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, కొండగట్టు దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కొడిమ్యాల,అక్టోబరు 13,(ప్రజాజ్యోతి):

14

### అంటువ్యాధుల భయం

చికెన్ వ్యర్థాలు కుళ్లిపోవడంతో ఈగలు, ఇతర కీటకాలు వృద్ధి చెందే అవకాశం ఉంది. దీంతో పరిసర ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాల నుంచి వెలువడే దుర్వాసనతో పరిసరాలు కలుషితమవుతున్నాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోశ ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

## కోరుట్లలో వక్ఫ్ భూములపై ఆరా!

12

## వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన పెంచాలి

- జిల్లా కలెక్టర్కో య శ్రీహర్ష
- బాధితులకు అండగా టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్

2



వెట్టిచాకిరీ నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు.. సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత. ఎక్కడైనా వెట్టిచాకిరీ ఘటనలు చోటుచేసుకుంటే వాటిని గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, బాధితులకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు.

## బాధితులకు సత్వర న్యాయం అందించాలి

- సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



రాజన్న సిరిసిల్ల జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరిచి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మంగళవారం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

2



ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలి 4




బతుకమ్మ ఘనంగా నిర్వహించాలి 10



చివరి ఆయకట్టుకు నీరందేనా? 14

## వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజల్లో
# అవగాహన పెంచాలి

**పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 13 ప్రజా జ్యోతి:** వెట్టిచాకిరీ నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు.. సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత. ఎక్కడైనా వెట్టిచాకిరీ ఘటనలు చోటుచేసుకుంటే వాటిని గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, బాధితులకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు. మంగళవారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో వెట్టిచాకిరీ నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన స్వేచ్ఛా రథాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. వెట్టిచాకిరీ నివారణ, బాధితులకు సకాలంలో ప్రభుత్వ సహాయం అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. వెట్టిచాకిరీకి సంబంధించిన ఘటనల సమాచారం అందించేందుకు 080-69434343 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. బాధితులు, వెట్టిచాకిరీ ఘటనల గురించి తెలిసినవారు ఈ నంబర్‌ను వినియోగించుకోవాలని సూచించారు. స్వేచ్ఛా రథం ద్వారా వెట్టిచాకిరీ వల్ల కలిగే అనర్థాలు, దాని నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ గౌరవప్రదంగా, స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం ఉండాలని, ఎవరూ దోపిడీకి గురికాకుండా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు, ప్రజలు సమన్వయంతో పనిచేసి వెట్టిచాకిరీ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సబ్సిడీ విత్తనాలు అందుబాటులో..

**ఇల్లంతకంట అక్టోబర్ 13(ప్రజా జ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సబ్సిడీ పైన శనగ మరియు మొక్కజొన్న విత్తనాలు అందుబాటులో కలవనీ కావలసిన రైతులు తమ యొక్క పట్టాదార్ పాస్ పుస్తకము ఆధార్ కార్డు తీసుకొని ఇల్లంతకుంట మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సంప్రదించగలరనీ ఏ ఓ జి ప్రవీణ్ తెలిపారు . మొక్కజొన్న విత్తనాలు నాలుగు కేజీల బ్యాగ్ కి గాను 360 రూపాయలు శనగ విత్తనాలు 16 కేజీల బ్యాగుకి గాను 432 రూపాయలు చెల్లించి విత్తనాలు పొందగలరనీ తెలిపారు.

# బతుకమ్మ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఉత్సవాలు
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి )

జిల్లాలో బతుకమ్మ పండుగ ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాలతోపాటు నగరంలో బతుకమ్మ పండుగకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అన్నారు. మహిళాభివృద్ధి, మెప్మా, డి.ఆర్. డి.ఏ అధికారులు అంగన్వాడి సిబ్బందిని, స్వయం సహాయక సంఘాల సభ్యులను, ప్రజా ప్రతినిధులను, ఉద్యోగులను భాగస్వాములను చేస్తూ ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని ఉన్నారు. మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులు శానిటేషన్, లైటింగ్ తదితర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బతుకమ్మలు నిమజ్జనం చేసే ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, అక్కడ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని అన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.పోలీస్, మెడికల్, యువజన క్రీడా శాఖలు సమన్వయంతో విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, తాగునీరు తదితర వసతులు కల్పించాలని ఆదేశించారు.

మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ నగరంలో బతుకమ్మ ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని తెలిపారు. నిమజ్జన ప్రాంతాలైన మానేరు నది, మానకొండూర్ కొత్తపల్లి, చెరువులు, చింతకుంట, కాకతీయ కెనాల్ ప్రాంతాల్లో లైటింగ్ శానిటేషన్ సహా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని తెలిపారు. బతుకమ్మ ఉత్సవాల కోసం పలు అభివృద్ధి పనులు కూడా చేపట్టినట్లు వివరించారు.ఈ సమావేశంలో ఆర్డీవోలు షర్మిల, జల కుమారి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గుడ్ల మనోహర్ నియామకం



**కోరుట్ల, అక్టోబర్ 13 ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కోరుట్లకు చెందిన గుడ్ల మనోహర్ నియమితులయ్యారు. రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టే అవకాశం లభించడంతో ఆయనకు పలువురు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కోరుట్ల ప్రాంతానికి చెందిన వ్యక్తికి రాష్ట్ర పద్మశాలి సంఘంలో ముఖ్యమైన బాధ్యత దక్కడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.రాష్ట్ర కార్యదర్శిగా గుడ్ల మనోహర్ నియామకం పద్మశాలి సమాజ అభ్యున్నతికి మరింత కృషి చేసేందుకు ఒక అవకాశంగా పలువురు భావిస్తున్నారు. చేనేత రంగాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న నేతన్నల సమస్యలను పరిష్కరించడం, వారి సంక్షేమానికి కృషి చేయడం, పద్మశాలి కుటుంబాల అభివృద్ధికి తోడ్పడటం వంటి అంశాలపై సంఘం మరింత దృష్టి సారించాలని ఆశిస్తున్నారు.రాష్ట్ర కార్యదర్శిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పద్మశాలి సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు సమాజంలోని యువత, మహిళలు, చేనేత కార్మికుల అభివృద్ధికి కృషి చేయాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. సమాజంలోని అందరినీ కలుపుకొని ఐక్యతతో ముందుకు సాగుతూ పద్మశాలీల సమస్యలను రాష్ట్రస్థాయి నాయకత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నారు.

# బాధితులకు సత్వర న్యాయం అందించాలి



**ముస్తాబాద్, అక్టోబర్ 13( ప్రజా జ్యోతి ):** రాజన్న సిరిసిల్ల జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరిచి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మంగళవారం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న దర్యాప్తులు, స్టేషన్ రికార్డులు, సిబ్బంది హాజరు, రౌడీషీటర్లు, నేరస్తులపై నిఘా తదితర అంశాలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చే బాధితులకు అందుతున్న సేవల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో అధికారులు, సిబ్బంది మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను శ్రద్ధగా విని సత్వర న్యాయం అందేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌లో వివిధ విభాగాల వారీగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును వ్యక్తిగతంగా పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి**

గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోకుండా పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టుల పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**డయల్ 112 కాల్స్‌పై తక్షణమే స్పందించాలి**

విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్పీ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేయాలని, డయల్ 112కు కాల్ వచ్చిన వెంటనే పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ సిబ్బంది స్పందించి సంఘటనా స్థలానికి చేరుకోవాలని ఆదేశించారు. ఆపదలో ఉన్న బాధితులకు తక్షణ సహాయం అందిస్తూ పోలీసులపై ప్రజలకు నమ్మకం పెరిగేలా విధులు నిర్వహించాలని సూచించారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ తనిఖీలో ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్రచారి, సిరిసిల్ల రూరల్ సీఐ నాగేశ్వరరావు, ముస్తాబాద్ ఎస్సై జ్యోతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధుడి ఆత్మహత్యాయత్నం..
# కాపాడిన హోంగార్డు



**కరీంనగర్ క్రైం, అక్టోబర్ 13, (ప్రజాజ్యోతి):** వ్యక్తిగత సమస్యలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వృద్ధుడిని కరీంనగర్ లేక్ అవుట్‌పోస్ట్‌కు చెందిన హోంగార్డు వి. అంజనేయులు సమయస్ఫూర్తితో స్పందించి కాపాడారు.బొమ్మిడేని కొమురయ్య (80) అనే వృద్ధుడు వ్యక్తిగత సమస్యల కారణంగా మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా,విధుల్లో ఉన్న హోంగార్డు వి. అంజనేయులు తక్షణమే స్పందించి ఆయన ప్రాణాలను కాపాడారు.అనంతరం వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.ఈ సందర్భంగా లేక్ అవుట్‌పోస్ట్ ఆర్ఎస్ఐ బి. రమేష్ వృద్ధుడి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.వృద్ధుడికి కుటుంబ సభ్యులు అండగా నిలవాలని,వ్యక్తిగత సమస్యలతో ఇబ్బందులు ఎదురైనప్పుడు ఆయనకు ధైర్యం చెబుతూ,సమస్యలను ఎదుర్కొనేలా సహకరించాలని సూచించారు.ఆపద సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి వృద్ధుడి ప్రాణాలను కాపాడిన హోంగార్డుని పోలీసు అధికారులు అభినందించారు.

## కుమారుడి జ్ఞాపకార్థం 'అంబేద్కర్ నగర్' ఆర్చ్ కమాన్ నిర్మాణం

**రామగిరి, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి) :** కన్నకొడుకు జ్ఞాపకాలను పదిలపరుచుకుంటూ బొంకూరి పోశం తన కుమారుడు కీర్తిశేషులు అనిల్ కుమార్ పేరు మీద కల్వచర్ల గ్రామంలో అంబేద్కర్ నగర్ ఆర్చ్ కమాన్‌ను ఏర్పాటు చేయించారు. అనిల్ కుమార్ జయంతి సందర్భంగా ఆయన పుట్టినరోజున కమాన్‌ను ప్రారంభించి, అనంతరం కేక్ కట్ చేశారు. కుటుంబ సభ్యులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్, బీఎస్పీ మంథని నియోజకవర్గ అధ్యక్షుడు జనగామ రవికుమార్, బీఆర్ఎస్ రామగిరి మండల అధ్యక్షుడు శంకేష్ రవీందర్, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మేదరవేన కుమార్ యాదవ్, దళిత సేన రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు గద్దల శంకర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కాపురబోయిన భాస్కర్, నాయకులు రొడ్డ శ్రీనివాస్, బూరుగు రాజు గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు జాతి శేఖర్, మంథని డివిజన్ దళిత సేన అధ్యక్షుడు ఊట్ల శ్రీను, పన్నూరు మాజీ ఉపసర్పంచ్ దామెర శ్రీనివాస్, చేలకల జవహర్, వార్డు సభ్యులు, అంబేద్కర్ సంఘం నాయకులు, మహిళలు, బొంకూరి పోశం కుటుంబ సభ్యులు, దళిత సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## మూడవ రోజు శ్రీ అన్నపూర్ణ దేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



**కోనరావుపేట,అక్టోబర్.13(ప్రజాజ్యోతి):** కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలివచ్చి భక్తిపారవశ్యంలో పూజలు చేశారు. శ్రీ అన్నపూర్ణ దేవి అన్నదానానికి, సమృద్ధికి, సకల శుభాలకు ప్రతీకగా భక్తులు విశ్వసిస్తారు. లోకంలోని సమస్త జీవులకు ఆహారాన్ని ప్రసాదించే తల్లిగా అమ్మవారిని కొలుస్తారు. అన్నపూర్ణ దేవి అనుగ్రహంతో ప్రజలందరికీ అన్నపానీయాలకు కొరత లేకుండా, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కొబ్బరికాయలు సమర్పించి, కుంకుమార్చనలు నిర్వహించారు. తమ కుటుంబాలు సుఖశాంతులతో ఉండాలని, గ్రామ ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు లభించాలని మొక్కులు చెల్లించుకున్నారు. దేవి నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఒక్కో అవతారానికి ఒక్కో ప్రత్యేకత ఉండగా, శ్రీ అన్నపూర్ణ దేవి రూపంలో అమ్మవారి దర్శనం భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించింది. అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసరాలు భక్తిమయంగా మారాయి. పల్లిమక్త గ్రామంలో జరుగుతున్న ఈ నవరాత్రి ఉత్సవాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# బతుకమ్మ పండుగ వేళ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి





- **వార్డుల లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ పనులను పరిశీలించిన.**
- **మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**

**వేములవాడ,అక్టోబర్,13:ప్రజాజ్యోతి.** ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని ప్రతి వార్డును పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని పండుగ సమయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రోడ్లు, వీధుల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.బతుకమ్మ పండుగను ప్రజలందరూ పరిశుభ్రమైన వాతావరణంలో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని పట్టణ పరిశుభ్రతలో ప్రజలు కూడా మున్సిపాలిటీకి సహకరించాలని, చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపల్ స్వచ్ఛ ఆటో లకు ఇచ్చి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలి అని నిర్దేశిత ప్రదేశాల్లోనే చెత్తను వేయాలని ప్రజల సహకారం ఉంటేనే పట్టణం మరింత పరిశుభ్రంగా ఉంటుందని వారన్నారు,వారి వెంట మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు

## కందికట్కూర్ బస్టాండ్‌లో అన్నపూర్ణ దేవి అవతారంలో దుర్గమ్మ తల్లి దర్శనం

### కూరగాయలతో అలంకరణ. భక్తులకు కనువిందు చేస్తున్న అమ్మవారి దివ్యరూపం



**ఇల్లంతకుంట అక్టోబర్ 13(ప్రజా జ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ బస్టాండ్‌లో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారు అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. సకల జీవరాశులకు ఆహారాన్ని అందించే అన్నపూర్ణ మాత రూపంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పచ్చని ఆకులు, పూలమాలలతో అత్యంత సుందరంగా అలంకరించారు. అమ్మవారి దివ్యరూపం, ఇరువైపులా సింహాల ప్రతిరూపాలు, ఎర్రని కాంతులతో మెరిసిపోతున్న మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అన్నమే పరబ్రహ్మ స్వరూపం అనే సందేశాన్ని చాటుతూ అన్నపూర్ణ దేవి అవతారంలో దర్శనమిస్తున్న దుర్గమ్మ తల్లిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. అమ్మవారిని కూరగాయలతో అలంకరించడం భక్తి భావానికి, ప్రకృతి పట్ల గౌరవానికి, అన్నదాతల కష్టానికి ప్రతీకగా నిలుస్తోంది.ప్రతి ఇంటా అన్నపూర్ణమ్మ కటాక్షం ఉండాలని, రైతుల పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని భక్తులు అమ్మవారిని ప్రార్థిస్తున్నారు.

# ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలి

- ఎల్ నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలు వేయాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- బోయినపల్లి మండలం వరద వెల్లిలో ఆయిల్ పామ్ మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్





**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి):**

బోయినపల్లి మండలం వరదవెల్లిలో తరిగొప్పుల మురళి అనే రైతు 4 ఎకరాల 20 గుంటల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ హాజరై మొక్కలు నాటారు. మొక్కలు నాటేందుకు వీ బీ జీ రామ్ జీ కింద కూలీలతో గుంతలు తవ్వించారు. అలాగే మొక్కలు నాటించారు. మూడు ఏండ్ల పాటు కూలీలు కలుపు మొక్కల నిర్మూలన, నీటిని పట్టి మొక్కలను సంరక్షించే పనులు చేయనున్నారని అధికారులు తెలిపారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుతో దీర్ఘ కాలం పాటు ఆదాయం సమకూరుతుందని వివరించారు. జిల్లాకు సరిహద్దులోని సిద్దిపేట జిల్లాలో నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిందని వెల్లడించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో దృష్ట్యా రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటలు సాగు చేయాలని సూచించారు.

**పామ్ పాండ్ పనుల పరిశీలన.**

రత్నంపేట గ్రామపంచాయతీ పరిధిలో రైతు కొటగాని పద్మ ఆయిల్ పామ్ తోటలో పామ్ పాండ్ నిర్మించుకుంటుండగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఎంత మంది కూలీలకు ఉపాధి దొరుకుతుందని, ఎంత విస్తీర్ణంలో నిర్మిస్తున్నారని ఆరా తీశారు? జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జలసిరి కింద పామ్ పాండ్, ఇంకుడు గుంతలు, బోర్ వెల్ రీచార్జ్ నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. రైతులు, గృహ నిర్మాణదారులు తప్పకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. దీంతో వాన నీటిని సంరక్షించవచ్చని, భూ గర్భ జలాలు వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు, ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ షరీఫోద్దీన్, ఇంచార్జి ఎంపీడీఓ శ్రీధర్ ఉన్నారు.

# ఎస్సీ, ఎస్టీ బాధితులకు సత్వర న్యాయం అందించాలి

- కలెక్టర్ బి. సత్యప్రసాద్
- జగిత్యాల జిల్లాలో ఈ ఏడాది 79 అట్రాసిటీ కేసులు నమోదు
- బాధితులకు రూ.6.90 కోట్ల పరిహారం చెల్లింపు




**జగిత్యాల, అక్టోబర్ 13, ప్రజా జ్యోతి:**

ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరిగే అఘాయిత్యాల కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలపై అఘాయిత్యాల నిరోధక చట్టం, పౌర హక్కుల పరిరక్షణ చట్టాల అమలుపై మంగళవారం జగిత్యాల ఐడీఓసీలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 79 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. వీటిలో 20 కేసులు నిరూపితమయ్యాయని, మిగిలిన కేసులు న్యాయస్థానాల పరిధిలో ఉన్నాయని వివరించారు. బాధితులకు పరిహారం అందించే విషయంలో కలెక్టరేట్ స్థాయిలో ఎలాంటి ప్రతిపాదనలు పెండింగ్‌లో లేవని స్పష్టం చేశారు. మొత్తం రూ.7.60 కోట్ల పరిహారానికి గాను ఇప్పటి వరకు రూ.6.90 కోట్లు చెల్లించామని, మిగిలిన రూ.79 లక్షలు ప్రభుత్వ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి నెల గ్రామ స్థాయిలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని అధికారులకు సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను సకాలంలో పొందే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న కుల ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హులకు త్వరగా పత్రాలు అందజేయాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం అందించడంలో ఎలాంటి జాప్యం జరగకుండా చట్ట నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అనంతరం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన బాధితులు ఫిర్యాదుల కోసం పోలీస్ స్టేషన్లకు వచ్చినప్పుడు అధికారులు సానుకూలంగా స్పందించి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. దసరా పండుగ సందర్భంగా జిల్లాలోని ప్రతి గ్రామ అభివృద్ధి కమిటీకి కుల వివక్షకు తావులేకుండా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. అన్ని వర్గాల ప్రజలు పండుగ వేడుకల్లో సమానంగా పాల్గొనేలా చూడాలని, గ్రామాల్లో సామాజిక సామరస్యం, సమానత్వ భావనలను పెంపొందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అట్రాసిటీ కేసుల పురోగతి, బాధితులకు పరిహారం చెల్లింపు, కుల ధ్రువీకరణ పత్రాల జారీ, పౌర హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై సమీక్షించారు. చట్టాల అమలును పకడ్బందీగా పర్యవేక్షిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఆర్డీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ కరాటే పోటీలకు కాకతీయ స్మార్ట్ కిడ్స్ విద్యార్థి ఎంపిక




**కరీంనగర్,అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి ):** శ్రీలంకలో అక్టోబర్ 16, 17 తేదీల్లో నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాల విద్యార్థి కె. ఆదిత్య సాయి ఎంపిక య్యాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ క్రాంతి కుమార్ ఆదిత్య సాయిని అభినందించారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిరంతర సాధనతో ఆదిత్య సాయి ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయమన్నారు. అంతర్జాతీయ వేదికపై ప్రతిభను చాటుకుని, పోటీల్లో విజయం సాధించి పాఠశాలతో పాటు దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆదిత్య సాయి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## అగ్నిబాధిత కుటుంబానికి 10 వేల ఆర్థికసాయం

**ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు కృషి చేస్తా, మద్దుల గోపాల్ రెడ్డి**



**ఎండపల్లి, అక్టోబర్ 13 ప్రజా జ్యోతి:** మండల కేంద్రంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన గ్రామ ఉప సర్పంచ్ దాసరి కళ్యాణి కొమురయ్య కుటుంబానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మద్దుల గోపాల్‌రెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వపరంగా సహాయం అందేలా కృషి చేస్తానని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.కొమురయ్య, ఆయన భార్య కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నారు. అగ్నిప్రమాదంలో ఇంట్లోని వస్తువులు, దుస్తులు, బంగారు ఆభరణాలు, పిల్లల చదువుకు సంబంధించిన ధ్రువపత్రాలు దెబ్బతిన్నట్లు సమాచారం. ఆయన తండ్రి వైద్య ఖర్చుల కోసం అప్పుగా తెచ్చుకున్న నగదు కూడా కాలిపోయినట్లు తెలిసింది.మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సహకారంతో బాధిత కుటుంబానికి ప్రభుత్వ సాయం అందేలా ప్రయత్నిస్తానని మద్దుల గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇంటి నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గెల్లు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సంగ రమేష్, పలు గ్రామాల సర్పంచులు జీ.రెడ్డి మహేందర్‌రెడ్డి, పడిధం లావణ్య మొగిలి, బెద్దల ప్రవీణ్, బాలసాని శారద మల్లేశం, రాజు, అశోక్, లక్ష్మణ్, కరుణాకర్, రఘువర్ధన్, మల్లారెడ్డి, మల్లేశం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడాలి

**ఓటరు జాబితా నుంచి తొలగించిన ఓట్లను చేర్చాలి**
**సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు**



**సుల్తానాబాద్, అక్టోబరు 13(ప్రజా జ్యోతి):** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కార్మికవర్గం ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని, ఓటరు జాబితా నుంచి అక్రమంగా తొలగించిన ఓటర్లను తిరిగి చేర్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేసే విధంగా వ్యవహరిస్తోందని ముత్యంరావు ఆరోపించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో కఠినమైన నిబంధనలు తీసుకొచ్చి సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని అన్నారు. ఈ ప్రక్రియ ద్వారా బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.ఎన్నికల జాబితా సవరణపై దేశ వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఓటరు హక్కులను కాపాడాల్సిన ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడికి ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఎన్నికల ప్రక్రియపై ప్రశ్నలు లేవనెత్తుతూ నిరసన తెలిపే విద్యార్థులు, యువకులు, ప్రజలపై దేశద్రోహులనే ముద్ర వేయడం సరికాదని ముత్యంరావు అన్నారు. ప్రజల నిరసనలను అణచివేసేందుకు నిర్బంధ చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తాండ్ర అంజయ్య, రాజమల్లు, బ్రహ్మచారి, వీరగోని కిరణ్ గౌడ్, పూసల సంపత్, సదయ్య, విలాస్, వెంకటేష్, మంజూరు, మాతంగి శంకర్, రామచందర్, అరవింద్, ఆరేపల్లి సురేష్, కల్వల ఎల్లయ్య, మహంకాళి మల్లేష్, ఎనగందుల కుమార్, కుమ్మరి సత్యం, పోగుల మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గామాతను దర్శించుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్

**కరీంనగర్ టౌన్ అక్టోబర్ 13(ప్రజా జ్యోతి):** నగరంలోని 11వ డివిజన్ కట్ట రాపూర్‌లో శ్రీ నవదుర్గ యూత్ సభ్యుల ఆహ్వానం మేరకు కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న పటేల్ దుర్గామాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. దసరా పండుగను పురస్కరించుకుని అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజల జీవితాల్లో సుఖశాంతులు, సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, సోదరభావం, సామాజిక సమైక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీ నవదుర్గ యూత్ సభ్యులు అమ్మవారి పూజల కోసం చేసిన ఏర్పాట్లను ఆకుల నర్సన్న పటేల్ అభినందించారు. దుర్గామాత కరుణాకటాక్షాలు భక్తులందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. శ్రీ నవదుర్గ యూత్ సభ్యులు, స్థానిక యువకులు, భక్తులు, కట్టరాపూర్ ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.



### రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా

# సాగునీటి విడుదల

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే విజయరమణారావుకు సర్పంచ్ కృతజ్ఞతలు**



**ఎలిగేడు, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి):** ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు అందక వరి పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సాగునీటి విడుదలకు సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావుకు ర్యాకల్ దేవ్ పల్లి గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు సకాలంలో అందకపోవడంతో వరి పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని, దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని పేర్కొన్నారు. రైతుల కష్టాలను, పంటల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని సాగునీటి విడుదలకు సహకరించడం అభినందనీయమన్నారు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవించే రైతులకు సాగునీరు ఎంతో కీలకమని, పంటలకు అవసరమైన సమయంలో నీరు అందితేనే దిగుబడులు సాధించి రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోగలరని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుకు గ్రామ రైతుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత నిస్తూ, సాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు. రైతులకు అండగా నిలుస్తూ సాగునీటి విడుదలకు సహకరించిన ప్రజాప్రతినిధులకు మరోసారి గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# అన్నపూర్ణ దేవిగా దుర్గమ్మ తల్లి దర్శనం



**ఇల్లంతకుంట అక్టోబర్ 13(ప్రజా జ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వంతడుపుల గ్రామంలో భీమ్ నగర్ దుర్గా కమిటీ ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కొలువుదీరిన దుర్గామాత అమ్మవారు అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిస్తూ సకల జీవరాశులకు ఆహారాన్ని అందించే అన్నపూర్ణ మాత రూపంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పచ్చని ఆకులు, పూలమాలలతో అత్యంత సుందరంగా అలంకరించారు. అమ్మవారి దివ్యరూపం, ఇరువైపులా సింహాల ప్రతిరూపాలు, ఎర్రని కాంతులతో మెరిసిపోతున్న మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.దేవి నవరాత్రి లో భాగంగా ఈరోజు అన్నమే పరబ్రహ్మ స్వరూపం అనే సందేశాన్ని చాటుతూ అన్నపూర్ణ దేవి అవతారంలో దర్శనమిస్తున్న దుర్గమ్మ తల్లిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. అమ్మవారిని కూరగాయలతో అలంకరించడం భక్తి భావానికి, ప్రకృతి పట్ల గౌరవానికి, అన్నదాతల కష్టానికి ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి ఇంటా అన్నపూర్ణమ్మ కటాక్షం ఉండాలని, రైతుల పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నారు.

# అనంతారం గ్రామంలో హెచ్చరిక బోర్డు



**ఇల్లంతకంట అక్టోబర్ 13(ప్రజా జ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో సర్వే నెంబర్ 119/ఇ, 122/ఆ గల భూమిలో రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్డీఓ ఆదేశానుసారం మంగళవారం రోజు మండల రెవెన్యూ అధికారులు ఆ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గ్రామంలోని వొల్లాల నర్సయ్య, అతని అన్న కు సంబంధించిన భూముల మధ్య వివాదం నడుస్తున్న సందర్భంగా ఎలాంటి గొడవలు జరుగకుండా ఉండుట కోసం ఆర్డీఓ ఆదేశానుసారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో ఆర్ ఐ సంతోష్, గ్రామ జీపీఓ రాజు, వొల్లాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# హన్మంతునిపేటలో 56 మందికి మధుమేహ పరీక్షలు

**పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 13 ప్రజా జ్యోతి:** గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి రంగనాయక ఆధ్వర్యంలో మంగళవారం హన్మంతునిపేట గ్రామంలో మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మ్యాడగోని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 56 మందికి మధుమేహ పరీక్షలు చేశారు. మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు ఆరోగ్య పరీక్షలు ఎంతగానో దోహదపడతాయి. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి రంగనాయక అధ్యక్షుడు లయన్ లింగాల తిరుపతిరెడ్డి, కార్యదర్శి లయన్ తాళ్ల మురళీకృష్ణ, సర్వీసెస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సభ్యుడు లయన్ కొమ్ము కరుణాకర్, లయన్లు బండి సంపత్, వీరబోయిన శ్రీకాంత్, గుర్రాల రమేష్ పాల్గొన్నారు.



# రామగిరి ఖిల్లా ట్రెక్కింగ్‌లో ప్రజలు పాల్గొనాలి

**కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 13 ప్రజా జ్యోతి:**



జిల్లా చారిత్రక వారసత్వ సంపద రామగిరి ఖిల్లా విశిష్టతను ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ అటవీ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 18న నిర్వహించనున్న 'మన జిల్లా–మన రామగిరి ఖిల్లా' ట్రెక్కింగ్ లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు. మంగళవారం పెద్దపల్లిలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం ఉదయం 6 గంటలకు బేగంపేట గ్రామం నుంచి ట్రెక్కింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు రామగిరి ఖిల్లాను సందర్శించి, అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించడంతో పాటు చారిత్రక విశేషాలను తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు పోస్టర్ పై ఉన్న క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ట్రెక్కింగ్ సమయంలో అటవీ ప్రాంతంలోని చెట్లు, మొక్కలు, ఇతర వృక్ష సంపదకు నష్టం కలిగించకుండా ప్రకృతిని పరిరక్షించాలని కోరారు. చారిత్రక కట్టడాల ప్రాధాన్యతను గుర్తించి వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ప్రకృతి పరిరక్షణ, చారిత్రక వారసత్వంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.కార్యక్రమంలో ఏజే పెడల్స్ సైకిల్స్ కు చెందిన అఖిల్ రెడ్డి, మాజీ సైనికుడు, అంతర్జాతీయ పర్వతారోహకుడు లెంకల మహిపాల్ రెడ్డి, పెద్దపల్లి యువశక్తి సోషల్ మీడియా ప్రతినిధి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

**పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 13 ప్రజా జ్యోతి:**

**ఎమ్మెల్యే విజయరమణారావు సతీమణి స్వరూప ప్రత్యేక పూజలు**



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మినీ ట్యాంక్‌బండ్‌పై ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సతీమణి స్వరూప తొలుత బతుకమ్మకు దీపారాధన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో పాటు వివిధ శాఖల ఉద్యోగులు బతుకమ్మ పాటలు పాడుతూ, ఆడుతూ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పూలతో బతుకమ్మలను అలంకరించి సంప్రదాయబద్ధంగా నిర్వహించిన వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి వచ్చిన వారికి ప్రసాదం అందించడంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర మాట్లాడుతూ పూలతో ప్రకృతిని పూజించే బతుకమ్మ పండుగ ప్రతి ఒక్కరిలో శారీరక, మానసిక ఉల్లాసాన్ని నింపుతుందని తెలిపారు. ఉద్యోగ విధులతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ఇలాంటి వేడుకల్లో పాల్గొనడం సంతోషకరమన్నారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించిన ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, పోలీసు శాఖ సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, సూపరింటెండెంట్ సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వినూత్నంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్



**వేములవాడ,అక్టోబర్,13 (ప్రజా జ్యోతి):** ఢిల్లీలోని బారకంబ రోడ్డు నుండి సుప్రీంకోర్టు వరకు ఓట్ చోరీకి వ్యతిరేకంగా, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డితో కలిసి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొనడం జరిగింది. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు గౌరవం, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ నిరసన కార్యక్రమం ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరుకు తన ఓటు హక్కుపై పూర్తి విశ్వాసం ఉండేలా ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా పనిచేయాల్సిన అవసరాన్ని తెలిపింది.. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు, ప్రజల ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రీ రాహుల్ గాంధీ నాయకత్వంలో నిరంతరం పోరాటం కొనసాగిస్తుంది..

## శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థాన అభివృద్ధికి విరాళం



**వేములవాడ,అక్టోబర్,13 (ప్రజా జ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధి మరియు విస్తరణ పనుల కోసం కరీంనగర్ సప్తగిరి కాలనీకి చెందిన కేతిరెడ్డి మల్లారెడ్డి – సుజాత దంపతులు రూ. 25,116/– ల నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వీఆర్వో పెరిక శ్రీనివాస్ భక్తులు నగదు రూపంలో విరాళాన్ని సమర్పించారు.

## కోనేరుపల్లికి జాతీయ స్థాయి బహుమతి



**చొప్పదండి, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి):** చొప్పదండి మండలం కోనేరుపల్లి గ్రామం మరోసారి జాతీయ స్థాయిలో తన ప్రత్యేకతను చాటుకుంది. భారత ప్రభుత్వం సెప్టెంబర్ నెలలో చేపట్టిన "గ్రీన్ ఎనర్జీ పంచాయతీ" ప్రణాళికలో గ్రామ సర్పంచ్ కాసు వేణుగోపాల రాజు దేశవ్యాప్తంగా ద్వితీయ స్థానంలో నిలిచారు. ఇందుకుగాను ఆయనకు రూ.20 వేల నగదు బహుమతి లభించింది. కేంద్రస్థాయిలో ద్వితీయ బహుమతి గెలుచుకోవడం ఆయనకు ఇది రెండోసారి కావడం విశేషం.క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూపొందించిన "సర్పంచ్ సంవాద్" యాప్ ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించారు. భారత గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేయడం లక్ష్యంగా, దేశంలోని 1.5 లక్షలకు పైగా గ్రామ సర్పంచులను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఈ యాప్ ద్వారా గ్రామాల మధ్య అనుభవాల మార్పిడికి అవకాశం కలుగుతోంది.జాతీయ స్థాయి గుర్తింపు రావడానికి మండల అభివృద్ధి అధికారి వేణుగోపాలరావు, మండల పంచాయతీ అధికారి రాజగోపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ప్రోత్సాహం కారణమని అన్నారు. గ్రామస్తుల సహకారంతోగ్రామాభివృద్ధికి మరింత కృషి చేస్తానని సర్పంచ్ తెలిపారు.

## పెద్దపల్లి ఎస్ఐగా గుమ్ముల రాజశేఖర్



**పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 13 ప్రజా జ్యోతి:** పెద్దపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్‌గా గుమ్ముల రాజశేఖర్ నియమితులయ్యారు. ప్రస్తుతం చెన్నూరు టౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఆయనను పెద్దపల్లికి బదిలీ చేస్తూ రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లిలో ఎస్ఐగా పనిచేస్తున్న నరేష్‌కుమార్‌ను రామగుండం సీసీఎస్‌కు బదిలీ చేశారు. పెద్దపల్లి ఎస్ఐగా నరేష్‌కుమార్ తక్కువ వ్యవధిలోనే బదిలీ కావడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సాధారణ బదిలీల్లో భాగంగానే ఈ మార్పు జరిగిందా, మరేదైనా పరిపాలనా కారణం ఉందా అన్న అంశంపై స్పష్టత లేదు. బదిలీకి సంబంధించి పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక కారణాలను వెల్లడించలేదు. మరోవైపు, పెద్దపల్లి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టనున్న గుమ్ముల రాజశేఖర్ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఉన్నతాధికారుల బదిలీ ఉత్తర్వులతో పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో అధికారుల మార్పు చోటుచేసుకుంది.

## పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు సీజ్



**సుల్తానాబాద్, అక్టోబరు 13 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని సుభాష్‌నగర్‌లో మంగళవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. సీఐ రంజిత్‌రావు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టి, శాంతిభద్రతల పరిరక్షణకు కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు చంద్రకుమార్, అశోక్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### భూ వివాదంలో వరి పంటకు

## గడ్డి మందు.. ఇద్దరు అరెస్ట్



**కోనరావుపేట,అక్టోబర్. 13(ప్రజాజ్యోతి)** భూ వివాదం నేపథ్యంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటకు గడ్డి మందు చల్లి నష్టం కలిగించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిని కోనరావుపేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ గ్రామానికి చెందిన ఉప్పుల అంజయ్య 2000 సంవత్సరంలో ఒక ఎకరం 20 గుంటల భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అయితే, ఆ భూమిని తన పేరు మీద మ్యుటేషన్ చేయించుకోలేదని పోలీసులు వెల్లడించారు. ధరణి వ్యవస్థ వచ్చిన తర్వాత అదే భూమి తమదేనంటూ దరిగె పర్వతాలు, దరిగె పద్మలు తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భూమికి సంబంధించిన ధరణి పాస్‌బుక్‌లు తమ వద్దే ఉన్నాయని చెబుతూ వివాదానికి కారణమయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ క్రమంలో కోతకు మరో 20 రోజులు మాత్రమే ఉన్న తన వరి పంటకు గడ్డి మందు చల్లి నష్టం కలిగించారని అంజయ్య ఆరోపిస్తూ కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును స్వీకరించిన ఎస్సై బి. రామ్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితులుగా పేర్కొన్న దరిగె పర్వతాలు, దరిగె పద్మలను పోలీసులు అదుపులోకి తీసుకుని, అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

# సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రత్యేక చర్యలు

### కోనరావుపేట పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించిన డీఎంహెచ్ఓ డా:ఏంజెలా ఆల్ఫ్రెడ్

**కోనరావుపేట,అక్టోబర్.13 (ప్రజా జ్యోతి):**



సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని వ్యాధి పట్ల అవసరమైన జాగ్రత్తలు పాటించేలా వైద్య సిబ్బంది గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ సూచించారు. మంగళవారం కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ఆమె ఆకస్మికంగా సందర్శించి, అక్కడ ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా మాతా శిశు ఆరోగ్య సేవలు, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ద్వారా అందిస్తున్న సేవలు, సీజనల్ వ్యాధుల నివారణకు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతోపాటు, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు.

**అసంక్రమిత వ్యాధుల గుర్తింపునకు స్క్రీనింగ్**

రక్తపోటు, మధుమేహం వంటి అసంక్రమిత వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు విస్తృతంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ సూచించారు. వ్యాధులు ఉన్నట్లు గుర్తించిన వారికి సకాలంలో వైద్య సేవలు, అవసరమైన చికిత్స అందిస్తూ నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ద్వారా ప్రజలకు సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని పేర్కొన్నారు.

**దోమల నివారణకు డ్రై డే కార్యక్రమాలు**

ప్రస్తుతం సీజనల్ వ్యాధులు, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎంహెచ్ఓ తెలిపారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతను పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమాలను నిర్వహిస్తూ దోమల వృద్ధికి కారణమయ్యే నీటి నిల్వలను తొలగించేలా ప్రజలను చైతన్యపరచాలని చెప్పారు. వ్యాధుల వ్యాప్తిపై నిరంతర నిఘా ఉంచాలని, జ్వరాల కేసులను గుర్తించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు, బాధితులకు సకాలంలో చికిత్స అందించాలని సూచించారు. వ్యాధుల నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ఆరోగ్య సిబ్బంది గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని తెలిపారు

**నిమ్మపల్లి ఆరోగ్య ఉపకేంద్రం సందర్శన**

అనంతరం కోనరావుపేట పీహెచ్‌సీ పరిధిలోని నిమ్మపల్లి ఆరోగ్య ఉపకేంద్రాన్ని డీఎంహెచ్ఓ సందర్శించి, క్షేత్రస్థాయిలో అందిస్తున్న వైద్య సేవలను సమీక్షించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా ఆరోగ్య సేవలు అందించాలని, టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలపై చైతన్యం తీసుకురావాలని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఆరోగ్య సమస్యలను గుర్తించి, అవసరమైన వైద్య సేవలు అందేలా సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సురేష్, ఎంపీహెచ్ఈఓ రామణాథం, సీహెచ్ఓ మోహన్, ఎంపీహెచ్ఎస్ రషీద్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

గర్భిణులను 12 వారాల్లోపు నమోదు చేయాలని డీఎంహెచ్ఓ సూచించారు. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రమాదకర గర్భధారణ కేసులను ముందుగానే గుర్తించి ప్రత్యేక వైద్య పర్యవేక్షణ అందించాలని, తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. అలాగే చిన్నారులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అన్ని టీకాలు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని ఆదేశించారు. టీకాల ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, ఏ చిన్నారి కూడా టీకాలకు దూరం కాకుండా సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు.

## పోచమ్మ ఆలయంలో పోటెత్తిన భక్తులు





**వేములవాడ,అక్టోబర్,13 (ప్రజా జ్యోతి):** వేములవాడ రాజన్న ఆలయానికి అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. భక్తి శ్రద్ధలతో అమ్మవారికి ఇష్టమైన బోనాల నైవేద్యాలు సమర్పించి సేవలో తరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు రద్దీగా మారాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

# రాజన్న ఆలయంలో చంద్రఘంటగా అమ్మవారి దర్శనం

**శరన్నవరాత్రిఉత్సవాల్లోభాగంగా ప్రత్యేక అలంకరణ**



**వేములవాడ, అక్టోబర్, 13: ప్రజాజ్యోతి** వేములవాడ శ్రీభీమేశ్వరస్వామి ఆలయంలోశరన్నవరాత్రిఉత్సవాలువైభవంగాకొనసాగుతున్నాయి. నవరాత్రిఉత్సవాల్లోభాగంగామంగళవారంఅమ్మవారుచంద్రఘంట రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.ప్రత్యేకఅలంకరణలోకొలువుదీరినఅమ్మవారినిదర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.అమ్మవారికిప్రత్యేకపూజలునిర్వహించి,మొక్కులు చెల్లించుకున్నారు.నవరాత్రిఉత్సవాల్లోభాగంగాఅమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించిపూజించడంఆనవాయితీగా వస్తోంది. ఈక్రమంలోచంద్రఘంటరూపంలోదర్శనమిచ్చిన అమ్మవారినిదర్శించుకునేందుకుదయంనుంచే భక్తులు ఆలయానికి చేరుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలునిర్వహించారు. తమ కుటుంబాలుసుఖ సంతోషాల తో ఉండాలని,ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలుకలగాలని అమ్మవారిని ప్రార్థించారు.ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు, వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆలయ పరిసరాల్లో భక్తిమయ వాతావరణం నెలకొంది. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో ఆలయ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూ లైన్ల ద్వారా క్రమపద్ధతిలో దర్శనం కల్పిస్తున్నారు. తాగునీటి సదుపాయంతో పాటు భక్తులకు అవసరమైన ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. భక్తులు ప్రశాంతంగా



అమ్మవారిని దర్శించుకుని తిరిగి వెళ్లేలా ఆలయ సిబ్బంది తగినచర్యలుతీసుకుంటున్నారు.శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రోజుకో అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారిని చూసేందుకు భక్తులు ఆసక్తిచూపుతున్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు తమపై ఉండాలని కోరుకుంటూ భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభతో కొనసాగుతున్నాయి.

## అన్నపూర్ణ దేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



**కొనరావుపేట, అక్టోబర్.13(ప్రజాజ్యోతి)** కొనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో శ్రీ అమ్మ భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అమ్మవారు అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు కొన సాగుతున్నాయి.

## విద్యుత్ కోత విధించి రైతులను ఇబ్బందుల గురి చేస్తున్న ప్రభుత్వం

**బిజెపి మండల అధ్యక్షుడు చిలువేరి సంపత్ కుమార్**



**కాల్వ శ్రీరాంపూర్ అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి)** తీవ్రంగా విద్యుత్ కోతలు విధిస్తూ రైతులను ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరి సంపత్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం రోజున ప్రజా జ్యోతి విలేకరితో మాట్లాడుతూ. వరి రైతులు పెట్టుబడులు పెట్టి కరెంటు కోత వల్ల వరి పొట్ట కట్టే దశలో వుల్లారిపోయే పరిస్థితి ఉందని ఆయన వాపోయారు. రైతులను అన్ని విధాల ఆదుకుంటామని పగడ్ బాల్ పలికే కాంగ్రెస్ ప్రభుత్వం. రైతుల గురించి పట్టించుకో వడంలేదని ఆయన అన్నారు. రైతుల పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం సిద్ధ శుద్ధి ఉన్న నిరంతరంగ విద్యుత్ అందించి రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్**



**కరీంనగర్ రూరల్: అక్టోబర్ 13( ప్రజాజ్యోతి )** మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి కార్యక్రమాల అమలుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ అన్నారు. కరీంనగర్ రూరల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని చర్చించారు.

# నాగిరెడ్డిపూర్‌లో సాగిన పండుగ సందడి, అభివృద్ధి సమీక్ష

**గంగాధర 13/అక్టోబర్/2026: (ప్రజా జ్యోతి)** మండలంలోని నాగిరెడ్డిపూర్ గ్రామంలో మంగళవారం ఆధ్యాత్మికతతో పాటు అధికారిక కార్యక్రమాలు సందడిగా సాగాయి. ఒకవైపు గ్రామాభివృద్ధిపై సమీక్షలు, మరోవైపు తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలతో గ్రామ పంచాయతీ కార్యాలయం కళకళలాడింది.

**గ్రామ సభ.. 17వ విడత సామాజిక తనిఖీ!**

నాగిరెడ్డిపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో 17వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామ సభను అత్యంత పారదర్శకంగా నిర్వహించారు. ఈ సభలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, కూలీల వేతనాలు, నిధుల వ్యయానికి సంబంధించిన సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) నివేదికను అధికారులు చదివి వినిపించారు. గ్రామస్తుల సమక్షంలో పనుల నాణ్యతను సమీక్షించారు. గ్రామ అభివృద్ధికి నిధులు సక్రమంగా వినియోగపడేలా చూసేందుకే ఈ తనిఖీలు దోహదపడతాయని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. గ్రామ సర్పంచ్ గనుకొండ యశోద – బాబు, ఉప సర్పంచ్ పంజాల క్రిష్ణ, కార్యదర్శి లావణ్య, డిఆర్పీ మౌనిక, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు ఈ సభలో పాల్గొన్నారు.

**జీపీ కార్యాలయంలో వైభవంగా బతుకమ్మ వేడుకలు..!**

నాగిరెడ్డిపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళా ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, గ్రామానికి చెందిన మహిళలు రంగురంగుల తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి కార్యాలయానికి తీసుకొచ్చారు. బతుకమ్మల చుట్టూ చేరి సాంప్రదాయ శైలిలో చప్పట్లు కొడుతూ, పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడారు. ఈ వేడుకలతో పంచాయతీ కార్యాలయంలో పండుగ వాతావరణం సంతరించుకుంది. ముగింపులో మహిళలకు తీపి పదార్థాలను పంపిణీ చేశారు.

**త్వరలో భూ భారతి రీసర్వే ప్రారంభం..!**

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'భూ భారతి' రీ-సర్వే కార్యక్రమం త్వరలోనే నాగిరెడ్డిపూర్‌లో ప్రారంభం కానుందని గ్రామ సభ లో తహశీల్దార్ అంబటి రజిత స్పష్టం చేశారు. గ్రామ పరిధిలోని ప్రతి ఇంచ్ భూమిని పక్కాగా సర్వే చేయనున్నారు. ఈ రీ-సర్వే ద్వారా భూ యజమానులకు స్పష్టమైన హక్కులు లభిస్తాయని, సరిహద్దు తగాదాలకు అడ్డుకట్ట పడుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు. సర్వే ప్రారంభమయ్యే నాటికి రైతులు, భూమి యజమానులు తమ భూములకు సంబంధించిన సరిహద్దులను క్లియర్ చేసుకోవాలని, ఈ ప్రక్రియకు పూర్తి స్థాయిలో సహకరించాలని అధికారులు కోరారు.






# మంథనిలో అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలి

- గోదావరి పుష్కర ఘాట్ వద్ద 10 రోజుల్లోగా కాంక్రీట్ పనులు ప్రారంభించాలి
- నాలుగు రోజుల్లోగా రోడ్డు పనుల డిజైన్లను ఖరారు చేయాలి
- మార్చి 2027 నాటికి సమీకృత డివిజన్ కార్యాలయాల భవన నిర్మాణం పూర్తి చేయాలి
- 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలి
- మంథనిలో అభివృద్ధి పనుల పరిశీలనలో పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**మంథని, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి):**



మంథనిలోని పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలన







మంథని ప్రాంతంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంథనిలోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు, మంథని–రామగుండం రహదారిపై హెలిప్యాడ్ నిర్మాణ పనులు, సమీకృత డివిజన్ కార్యాలయాల భవనం, నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రామగిరి మండలంలోని పన్నూరు క్రాస్ రోడ్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గోదావరి పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి, మరో 10 రోజుల్లోగా కాంక్రీట్ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించిన డిజైన్లను నాలుగు రోజుల్లోగా ఖరారు చేయాలని సూచించారు. అవసరమైన నిర్మాణ సామగ్రిని ముందుగానే సమకూర్చుకోవడంతో పాటు, రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న చెట్లు, పొదలను తొలగించే పనులను వేగవంతం చేయాలని తెలిపారు. పనుల పురోగతికి ఆటంకంగా ఉన్న సమస్యలను ఆర్డీఓ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని పుష్కర ఘాట్ వద్ద నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. రహదారి మధ్యలో డివైడర్ ఏర్పాటు చేస్తూ, పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారి నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు. మంథని–రామగుండం రహదారిపై ఉన్న హెలిప్యాడ్‌ను గోదావరి పుష్కరాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. రామగిరి మండలంలోని పన్నూరు క్రాస్ రోడ్ వద్ద జరుగుతున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మంథనిలో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్దేశిత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా అవసరమైన సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. సమీకృత డివిజన్ కార్యాలయాల భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, మార్చి 2027 నాటికి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనులకు అవసరమైన అదనపు నిధుల ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మంథని మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, ఇప్పటికే అధిక శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించేందుకు వీలుగా భవనాన్ని వీలైనంత త్వరగా సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ఆర్ అండ్ బి ఈఈ భావ్ సింగ్, ఆర్డీవో సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్,సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాటాలకు సిద్ధం కండి

**బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం**



**కరీంనగర్, అక్టోబర్ 13(ప్రజాజ్యోతి)** ఈ నెల 17వ తేదీతో ‘సేవా సంకల్ప్ అభియాన్’ ముగియనున్న నేపథ్యంలో, పార్టీ నిర్దేశించిన ప్రోగ్రాంలన్నీ విజయవంతంగా పూర్తి చేసేలా, రాబోయే 50 రోజుల పాటు ప్రజా సమస్యలపై, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై మరింత దూకుడుగా పోరాటాలు నిర్వహించేలా బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ముఖ్య నేతల సమావేశంలో కీలక దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు మంగళవారం రోజున కరీంనగర్లోని మహాశక్తి దేవాలయ ఆవరణలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సాయి ని మల్లేశం మాట్లాడుతూ ... రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను, ఎన్నికల హామీల వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ప్రజాక్షేత్రంలో నిలబడి ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక రాష్ట్ర స్థాయి సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలని,అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఈ వైఫల్యాలను గడపగడపకూ తీసుకెళ్లి ఎండగట్టాలని కోరారు. ఈ నెల 17 తర్వాత రాబోయే 50 రోజుల పాటు అనుసరించాల్సిన వివిధ కార్యక్రమాలు, ఆందోళనలు, ధర్నాలపై నేతలకు స్పష్టమైన ప్రణాళికను వివరించారు.కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి చేపట్టబోయే కార్యక్రమాలన్నిటినీ విజయవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టే ప్రజా ఉద్యమాలకు పార్టీ శ్రేణులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, కన్న కృష్ణ, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, వైదరామానుజం, చేపూరి సత్యం, శ్రవణ్ , ముత్యాల జగన్ రెడ్డి , గుంజేటి శివకుమార్, మైనారిటీ మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ లతో పాటు బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సంపు నరేష్ , కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి కార్యకర్తని ఫోన్‌లో పరామర్శించిన కేంద్ర మంత్రి



**కరీంనగర్, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి )** తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన సీనియర్ కార్యకర్త, బిజెపి మండల పార్టీ ఉపాధ్యక్షులు పబ్బ తిరుపతి ఇటీవల ప్రమాదవశాత్తూ ఆటో పై నుండి కిందపడటంతో ఆయన కాలు తీవ్రంగా గాయపడి ఫ్రాక్చర్ అయింది. ప్రస్తుతం ఆయన కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతికి ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తిరుపతికి మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులకు ఫోన్ ద్వారా సూచించారు.ఈ సందర్భంగా బిజెపి మాజీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి మాట్లాడుతూ... కేంద్ర మంత్రి బండి సంజయ్ పవిత్రమైన భవానీ దీక్షలో ఉండి కూడా, కార్యకర్త సంక్షేమాన్ని గుర్తుంచుకుని ఆరోగ్య పరిస్థితిపై వెంటనే స్పందించడం, ఆయనకు కార్యకర్తలపై ఉన్న ప్రేమాభిమానాలకు నిదర్శనమని కొనియాడారు. కార్యకర్త కష్టాల్లో ఉన్నాడని తెలిసిన వెంటనే స్పందించి ధైర్యం చెప్పడం అభినందనీయమని, ఈ విషయంలో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ కు తిమ్మాపూర్ మండల బిజెపి పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

## విధి నిర్వహణలో ఉత్తమ సేవలు..

**వీణవంక పోలీసులకు ప్రశంసా పత్రాలు**



**వీణవంక, అక్టోబర్ 13(ప్రజాజ్యోతి )** విధి నిర్వహణలో అంకిత భావంతో, క్రమశిక్షణతో ఉత్తమ సేవలు అందించిన వీణవంక పోలీస్ స్టేషన్ సిబ్బందికి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఐపీఎస్ ప్రశంసా పత్రాలు అందజేశారు. హుజూరాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని వీణవంక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ ఆవుల తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ నెల్లి మోహన్, కానిస్టేబుళ్లు గిన్నారపు రవి, నల్ల కోమల్, కుర్రే ప్రవల్లికలు విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఈ గుర్తింపు లభించింది.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సిబ్బందిని అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ, పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

## బొప్పాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గా మేడిపల్లి దేవానంద్





**ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి)** ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్గా నూతనంగా మేడిపల్లి దేవానందం వైస్ చైర్మన్ గా నందు కిషన్ సభ్యులుగా దండు శ్రీనివాస్ గంగయ్య విశ్వనాథ్ చందర్ సత్య నారాయణ తదితర సభ్యులుగా ఉన్నారు

## సర్పంచ్ ఇంటి ఎదుట మృతదేహంతో నిరసన



**చిగురుమామిడి/అక్టోబర్ 13, ప్రజా జ్యోతి,** చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ గ్రామంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నెల 6న సర్పంచ్ చెప్పడం వల్లే వీధి దీపాలు బాగు చేస్తూ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ కత్తెరమల్ల రమేష్ (31) విద్యుత్ షాక్‌కు గురయ్యాడని, ఆయన మృతికి సర్పంచే కారణమని కుటుంబ సభ్యులు, మాల సంఘం నాయకులు ఆందోళనకు దిగారు.షాక్‌కు గురైన రమేష్‌ను కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ, సోమవారం మృతి చెందాడు. మెరుగైన చికిత్స అందిస్తామని చెప్పి సర్పంచ్ సాంబార్ భారతమ్మ, కొమురయ్య పట్టించుకోలేదని బాధితులు మండిపడ్డారు. సర్పంచ్ ఇంటి ఎదుట మృతదేహంతో నిరసన తెల్పుతూ.. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, రమేష్ పేరిట ₹50 లక్షలతో ట్రస్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని బందోబస్తు నిర్వహించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని కరీంనగర్ రూరల్ ఏ సి పి విజయ్ కుమార్ పోలీసులు హామీ ఇవ్వడంతో నిరసనకారులు ఆందోళన విరమించారు.

# బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

**జగిత్యాల, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి):**



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బతుకమ్మ వేడుకల ఫొటోలు, వీడియోలతో విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు, సూపర్ ఎల్‌నినో ప్రభావాలు, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై బతుకమ్మ పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బతుకమ్మ వేడుకల నిర్వహణ, పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల అమలు, నిధుల సమీకరణ, పర్యాటక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై ఆమె పలు సూచనలు చేశారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు**

గ్రామాలు, పట్టణాల్లో ప్రజల భాగస్వామ్యంతో బతుకమ్మ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని వాణీ ప్రసాద్ సూచించారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. వేడుకలు జరిగే ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రవాణా, పార్కింగ్, భద్రత వంటి సౌకర్యాలను ముందుగానే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను విస్తృతంగా సేకరించి ప్రచారం చేయాలని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు.

**బతుకమ్మ పాటలతో సూపర్ ఎల్‌నినోపై అవగాహన**

సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయం, పర్యావరణంపై పడే ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని వాణీ ప్రసాద్ సూచించారు. బతుకమ్మ పాటల పోటీలను నిర్వహించి, నీటి పొదుపు, పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వనరుల సంరక్షణ వంటి అంశాలు పాటల్లో ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా సంఘాలు, యువతను ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు.

**పర్యాటక అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి**

రాష్ట్రవ్యాప్తంగా 56 పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను జిల్లాలకు బదిలీ చేసినట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఇందులో నాగర్‌కర్నూల్ జిల్లాకు 20, ఖమ్మం జిల్లాకు 12, జగిత్యాల జిల్లాకు రెండు ప్రాజెక్టులను అప్పగించినట్లు వెల్లడించారు. ఈ పనులను స్థానిక ఇంజినీరింగ్ శాఖల సమన్వయంతో నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల పురోగతి, నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, పనులు పూర్తయిన వెంటనే సంబంధిత బిల్లులను పర్యాటక కార్పొరేషన్‌కు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**రెండు వారాల్లో డీపీఆర్‌ల బాధ్యతలు అప్పగించాలి**

పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదికల (డీపీఆర్) తయారీ బాధ్యతలను రెండు వారాల్లోగా సంబంధిత ఇంజినీరింగ్ శాఖలకు లేదా తగిన సంస్థలకు అప్పగించాలని వాణీ ప్రసాద్ ఆదేశించారు. ప్రాజెక్టుల పరిధి, భూమి లభ్యత, మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, నిధుల సమీకరణ, అమలు గడువు వంటి అంశాలను డీపీఆర్‌లలో స్పష్టంగా పొందుపరచాలని తెలిపారు. అవసరమైన చోట కన్సల్టెన్సీ సహకారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

**హరిత హోటళ్ల పూర్తికి ప్రైవేట్ పెట్టుబడులు**

కొన్ని జిల్లాల్లో అసంపూర్తిగా ఉన్న హరిత హోటళ్ల నిర్మాణాలను పూర్తి చేసి, నిర్వహణలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో అవకాశాలను పరిశీలించాలని వాణీ ప్రసాద్ సూచించారు. ఆసక్తి చూపే ప్రైవేట్ పెట్టుబడిదారులను జిల్లా స్థాయిలో గుర్తించి, వారి సహకారంతో పనులను పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టాలని తెలిపారు.

**పర్యాటక ప్రణాళికలు, నిధుల సమీకరణపై దృష్టి**

ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆమె సూచించారు. ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి అందాలు, వారసత్వ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలు, స్వచ్ఛంద సంస్థల సహకారం, ప్రైవేట్ పెట్టుబడుల ద్వారా నిధుల సమీకరణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్వదేశ్ దర్శన్ పథకం కింద జిల్లాకు అనువైన ప్రాజెక్టులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్, వసతి, సమాచార బోర్డులు వంటి సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించారు. స్థానిక కళలు, హస్తకళలు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు, స్థానిక ఆహార సంస్కృతిని పర్యాటకంతో అనుసంధానం చేసి ఉపాధి అవకాశాలను పెంచాలని తెలిపారు.

**పర్యాటక ప్రాంతాల్లో భద్రతకు చర్యలు**

రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో సందర్శకుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని వాణీ ప్రసాద్ ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో భద్రతా సిబ్బందిని నియమించే చర్యలు చేపట్టాలని, సంబంధిత శాఖల సమన్వయంతో పర్యాటకులకు సురక్షిత వాతావరణం కల్పించాలని సూచించారు.

**అధికారులకు కలెక్టర్ ఆదేశాలు**

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులతో మాట్లాడుతూ, జిల్లాలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారులు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నప్రసాద వితరణలో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి )** జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నేడు సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రక్తదానంలో మరోసారి మానవత్వాన్ని చాటిన ఖాన్ సాబ్

- **అత్యవసర సమయంలో స్పందించి రోగికి ఏ పాజిటివ్ రక్తదానం..**
- **సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కోరుట్ల సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు అమెర్ ఖాన్**



**కోరుట్ల, అక్టోబర్ 13 ప్రజాజ్యోతి:** ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వం.. మరొకరి ప్రాణాన్ని కాపాడటమే అత్యున్నత సేవ అనే నినాదాన్ని ఆచరణలో చూపిస్తూ కోరుట్ల సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు అమెర్ ఖాన్ (ఖాన్ సాబ్) మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగికి అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం అవసరమైందని తెలుసుకున్న ఆయన, వెంటనే స్పందించి స్వయంగా రక్తదానం చేశారు. ఆపద సమయంలో ఆదుకోవడానికి ముందుకొచ్చిన ఖాన్ సాబ్‌ను రోగి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కృతజ్ఞతలతో అభినందించారు.

**సమాచారం అందిన వెంటనే స్పందన.. రక్తదానంతో ప్రాణదాతగా**

కోరుట్ల పట్టణంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, అవసరమైన వారికి తనవంతు సహాయం అందించడంలో ఖాన్ సాబ్ ఎప్పుడూ ముందుంటారు. తాజాగా ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగికి ఏ పాజిటివ్ రక్తం అత్యవసరమైందని సమాచారం అందడంతో ఆయన ఆలస్యం చేయకుండా స్పందించారు. స్వయంగా ఆసుపత్రికి వెళ్లి రోగికి అవసరమైన రక్తాన్ని దానం చేశారు.సకాలంలో రక్తం అందక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితుల్లో, రక్తదాతలు ముందుకు రావడం ఎంతో కీలకమని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడమే కాకుండా, సమాజంలో మానవత్వం, సేవాభావం ఇంకా సజీవంగా ఉన్నాయని ఖాన్ సాబ్ నిరూపించారు.

**యువతకు ఆదర్శంగా ఖాన్ సాబ్ సేవలు**

రక్తదానం అనేది కేవలం ఒక సేవా కార్యక్రమం మాత్రమే కాదు.. మరొకరి జీవితంలో ఆశలు నింపే గొప్ప మానవీయ కార్యం. రక్తం అవసరమైన సమయంలో కులమతాలు, ప్రాంతీయ భేదాలు చూడకుండా స్పందించి సహాయం చేయడమే నిజమైన సామాజిక బాధ్యత. ఈ స్ఫూర్తితో ఖాన్ సాబ్ కోరుట్ల పట్టణంలో రక్తదానానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తూ, అవసరమైన వారికి సహాయం అందించేందుకు ముందుంటున్నారు.యువత తమ శక్తిసామర్థ్యాలను సమాజ సేవకు వినియోగించాలని, రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని ఆయన సేవలు పరోక్షంగా సందేశమిస్తున్నాయి. పుట్టిన రోజులు, వేడుకలకే సేవను పరిమితం చేయకుండా, అత్యవసర సమయంలో రక్తదానం చేసి ఒకరి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఈ ఘటన గుర్తుచేస్తోంది.

**మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం రక్తదానం**

యువత రక్తం వేడిగా ఉండటం కాదు.. ఆ రక్తం మరొకరి ప్రాణాన్ని కాపాడేలా ఉండాలి. సేవ చేయడానికి కోట్లు అవసరం లేదు.. రక్తదానం చేసే మంచి మనసుంటే చాలు. మన రక్తం మరొకరి శరీరంలో ప్రవహిస్తే అదే మానవత్వానికి అసలైన అర్థం అనే సందేశానికి అనుగుణంగా ఖాన్ సాబ్ చేసిన సేవ పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

**ఖాన్ సాబ్‌కు కృతజ్ఞతలు తెలిపిన రోగి బంధువులు**

అత్యవసర సమయంలో వెంటనే స్పందించి రక్తదానం చేసిన కోరుట్ల సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు అమెర్ ఖాన్ (ఖాన్ సాబ్)కు రోగి బంధుమిత్రులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యుడు షాను, జగిత్యాల సోషల్ వర్కర్ రియాజ్ పాల్గొన్నారు.సమాజంలో సేవాభావం కలిగిన వ్యక్తులు ముందుకు వచ్చి రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఎంతోమంది రోగులకు సహాయం అందే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. రక్తదానం ఒక బాధ్యత మాత్రమే కాదు.. మానవత్వాన్ని చాటే గొప్ప సేవ అనే సందేశంతో ఖాన్ సాబ్ చేసిన ఈ రక్తదానం కోరుట్ల పట్టణంలో చర్చనీయాంశంగా నిలిచింది.

# బీజేపీ మండల యువమోర్చా అధ్యక్షులుగా గోండ వెంకటేష్



**బుగ్గారం అక్టోబర్ 13(ప్రజా జ్యోతి):** భారతీయ జనతా పార్టీ బుగ్గారం మండల యువమోర్చా అధ్యక్షులుగా గొండ వెంకటేష్ నియమితులయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు ఆదేశాల మేరకు ఆయనను నియమించినట్లు పార్టీ బుగ్గారం మండల అధ్యక్షుడు మెడవేణి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు మంచె రాజేష్ పాల్గొన్నారు.

యువత సమస్యల పరిష్కారానికి కృషి చేయాలిఈ సందర్భంగా మెడవేణి శ్రీధర్, మంచె రాజేష్ మాట్లాడుతూ.. మండలంలోని యువతను సంఘటితం చేస్తూ, వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గొండ వెంకటేష్‌కు సూచించారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, యువతకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ గ్రామస్థాయి నుంచి యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని అన్నారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామాల్లో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేస్తూ, యువతను ఏకతాటిపైకి తీసుకురావాలని పేర్కొన్నారు. యువత భాగస్వామ్యంతోనే పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తా**

బుగ్గారం మండల యువమోర్చా అధ్యక్షుడిగా నియమితులైన గొండ వెంకటేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన పార్టీ జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని, మండలంలోని యువతను సంఘటితం చేస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని పేర్కొన్నారు. నాయకులు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ బుగ్గారం మండలంలో యువమోర్చాను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# గ్యాస్ అక్రమ వినియోగంపై అధికారుల కొరడా,!

- **రాజారాంపల్లిలో అధికారుల ఆకస్మిక తనిఖీలు**
- **22 గృహ వినియోగ సిలిండర్లు సీజ్,**



**ఎండపల్లి, అక్టోబరు 13, ప్రజా జ్యోతి:** గృహ అవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నారన్న సమాచారంతో అధికారులు రంగంలోకి దిగారు. జగిత్యాల పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ శాఖ సిబ్బంది సంయుక్తంగా ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.హోటళ్లు, టీ స్టాళ్లు, టిఫిన్ కేంద్రాలు, ఇతర వ్యాపార సముదాయాల్లో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను ఉపయోగిస్తున్నారన్న సమాచారంపై అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మొత్తం 22 గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను గుర్తించి సీజ్ చేశారు.గృహ అవసరాల కోసం సరఫరా చేసే సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడం నిబంధనలకు విరుద్ధం. ఈ నేపథ్యంలో అధికారులు చేపట్టిన తనిఖీల్లో 22 సిలిండర్లు పట్టుబడటం స్థానికంగా చర్చనీయాంశమైంది

# ఘనంగా పిఎస్అర్ జన్మదిన వేడుకలు.. కూలీలకు పండ్ల పంపిణీ



**ఎండపల్లి, అక్టోబరు 13, ప్రజా జ్యోతి:** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొనుగోటి శ్రీనివాసరావు (బాపు) జన్మదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం అంబారీపేటలో అభిమానులు వేడుకలు నిర్వహించారు. యాదవ మహాసభ రాష్ట్ర యువజన కార్యదర్శి ఎలుక రాజు యాదవ్ సూచనల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పనుల్లో నిమగ్నమైన కూలీలకు పండ్లు పంపిణీ చేశారు.తమ అభిమాన నాయకుడి జన్మదినాన్ని పురస్కరించుకుని కూలీల మధ్య వేడుకలు నిర్వహించడం ద్వారా అభిమానులు తమ అనుబంధాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పొనుగోటి శ్రీనివాసరావు అభిమానులు పాల్గొని వేడుకలను నిర్వహించారు.

## పెద్దమ్మ గుడి దారికి మరమ్మతులు



మొరం పోయించి రాకపోకలకు మార్గం సుగమం

**బుగ్గారం అక్టోబర్ 13(ప్రజాజ్యోతి):** గ్రామంలోని బెస్త సత్తన్న ఇంటి సమీపం నుంచి పెద్దమ్మ గుడికి వెళ్లే దారిలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు గ్రామ సర్పంచ్ నక్క రాజవ్వ–రాజయ్య దృష్టికి తీసుకెళ్లారు. దారి సరిగా లేకపోవడంతో నిత్యం రాకపోకలు సాగించే రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా వ్యవసాయ పనుల నిమిత్తం ఈ మార్గంలో వెళ్లేందుకు అవస్థలు ఎదురవుతున్నాయని వివరించారు.

రైతుల సమస్యపై స్పందించిన సర్పంచ్ నక్క రాజవ్వ–రాజయ్య వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం పెద్దమ్మ గుడికి వెళ్లే దారిలో మొరం పోయించి మరమ్మతులు చేయించారు. దీంతో రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులు కొంతవరకు తొలగనున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యం**

గ్రామ ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామంలో రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట మరమ్మతులు చేపడుతూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్క రాజవ్వ–రాజయ్య, గ్రామ కార్యదర్శి అక్బర్, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్‌ల ఫోరం చేయూత

**బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం**



**ఎండపల్లి, అక్టోబరు 13, ప్రజా జ్యోతి:** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలో షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై నష్టపోయిన ఉపసర్పంచ్ దాసరి కళ్యాణి,కొమురయ్య కుటుంబానికి మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అండగా నిలిచింది. బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసింది. ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం సంభవించింది. విషయం తెలుసుకున్న ఉపసర్పంచ్‌ల ఫోరం ప్రతినిధులు స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేరుగు జంపన్న (జానీ), జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ముత్యాల స్వామి, ఎండపల్లి మండల అధ్యక్షుడు సింహరాజు క్రాంతి, మేడిపెల్లి సత్తన్న, సెల్వూరి రవీందర్, మల్యాల విజయ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# కోరుట్లలో వక్ఫ్ భూములపై ఆరా!

- వక్ఫ్ బోర్డు కమిటీ పనితీరును పరిశీలించిన ఇన్‌స్పెక్టర్ జమీర్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ అర్షత్
- వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులతో ప్రత్యేక భేటీ
- భూముల సమస్యలు, ఆస్తుల పరిరక్షణపై చర్చ



**కోరుట్ల, అక్టోబర్ 13 ప్రజాజ్యోతి**

కోరుట్ల పట్టణంలోని వక్ఫ్ భూములకు సంబంధించిన సమస్యలను తెలుసుకోవడంతో పాటు, స్థానిక వక్ఫ్ బోర్డు కమిటీ పనితీరును పరిశీలించేందుకు వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ జమీర్, అసిస్టెంట్ వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్షత్ వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కోరుట్లలో వక్ఫ్ బోర్డు కమిటీ నిర్వహిస్తున్న కార్యకలాపాలు, వక్ఫ్ భూముల స్థితిగతులు, వాటి పరిరక్షణకు సంబంధించిన అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు ఖలీఫ్, నజీబ్, ఖయ్యూం, వాజిద్, బీఆర్ఎస్ కౌన్సిలర్ ఎం.ఏ. వసీం ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో వక్ఫ్ భూములకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. భూముల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణలో కమిటీ పాత్ర వంటి అంశాలపై చర్చించారు.

**వక్ఫ్ భూముల పరిరక్షణకు ప్రాధాన్యత**

కోరుట్లలోని వక్ఫ్ భూములు, ఆస్తుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులు ఆరా తీశారు. వక్ఫ్ బోర్డు కమిటీ పనితీరు ఎలా ఉంది? భూములకు సంబంధించిన సమస్యలు ఏమిటి? వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు అవసరం? అనే అంశాలను వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను అర్థం చేసుకుని, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

**కబ్జాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలి**

వక్ఫ్ భూములు ఆక్రమణలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని, ఆస్తుల పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యం వహించరాదని ఈ సందర్భంగా చర్చించారు. ఎక్కడైనా వక్ఫ్ భూములకు సంబంధించి ఆక్రమణలు, వివాదాలు లేదా ఇతర సమస్యలు ఉంటే వాటి వివరాలను సేకరించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.వక్ఫ్ ఆస్తులు వాటి నిర్దేశిత ప్రయోజనాలకు ఉపయోగపడేలా చూడటంతో పాటు, వాటి వివరాలు, రికార్డులు సక్రమంగా ఉండేలా పర్యవేక్షణ అవసరమని అభిప్రాయపడ్డారు.

# శ్రీగిరి పర్వతంపై వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

**మహితాపూర్ కనకదుర్గాదేవికి 108 రకాల నైవేద్యాల సమర్పణ**





**రాయికల్, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి) :** మండలంలోని మహితాపూర్ గ్రామ సమీపంలోని శ్రీగిరి పర్వతంపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి 108 రకాల నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వివిధ రకాల నైవేద్యాలతో అమ్మవారిని పూజించడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో ప్రతిరోజూ అమ్మవారికి విశేష అలంకరణలు,పంచామృత అభిషేకం,శ్రీచక్ర సహిత నిత్య కుంకుమార్చన,మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో 108 రకాల నైవేద్యాలను సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడం ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని,గ్రామం సుభిక్షంగా వర్ధిల్లాలని,ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు.భక్తులకు మాజీ జెడ్పీటీసీ గోపి మాధవి రాజరెడ్డి అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బర్కం మల్లేష్,ఎలిగేటి అనిల్, మాజీ జెడ్పీ చైర్మన్ దావ వసంతతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## మారుపాక వినోద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకుల పంపిణీ






**కోరుట్ల, అక్టోబర్ 13 ప్రజాజ్యోతి:** గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మారుపాక వినోద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన మిత్రులు ఇటిక్యాల వ ృద్ధాశ్రమ ంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వినోద్ జ్ఞాపకాలను సేవా కార్యక్రమాల రూపంలో సజీవంగా ఉంచాలని సంకల్పించారు. ప్రతి సంవత్సరం వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు అనాథలు, వృద్ధులకు సహాయం అందించాలని నిర్ణయించారు. వినోద్ భౌతికంగా దూరమైనా.. నిరుపేదలకు చేసే సేవల్లో చిరంజీవిగా నిలుస్తాడని ఆయన మిత్రులు పేర్కొన్నారు.

## ఎస్ఆర్ఎస్పీ నీటితో చెరువులను నింపాలి

**కోరుట్ల, అక్టోబర్ 13 ప్రజాజ్యోతి:** కోరుట్ల పట్టణంలో రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తాళ్ల చెరువు, ఏకీన్పూర్‌లోని స్తంభాల చెరువులను ఎస్ఆర్ఎస్పీ కాలువ నీటితో వెంటనే నింపాలని 27వ వార్డు కౌన్సిలర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తిరుమల వాసు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. గత వర్షాకాలంలో సరైన వర్షాలు కురవక చెరువులు నిండలేదని, ఇప్పుడే నీటిని నింపితే భూగర్భ జలమట్టం పెరిగి వేసవిలో తాగునీటి సమస్యను నివారించవచ్చని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి చెరువులను నింపేందుకు చర్యలు తీసుకోవాలని తిరుమల వాసు కోరారు.



# ఓవర్‌లోడ్‌తో మొరాయించిన బస్సు..

**బీర్ పూర్ ఘాట్ రోడ్డుపై తప్పిన పెద్ద ప్రమాదం!**





**బీర్ పూర్, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి):** బీర్ పూర్ మండలం కొల్వాయి నుంచి జగిత్యాల వెళ్తున్న ఆర్టీసీ బస్సు, బీర్ పూర్ ఘాట్ రోడ్డు గుట్ట ఎక్కుతుండగా ఒక్కసారిగా ఆగిపోవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బస్సులో సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఉండటమే (ఓవర్‌లోడ్) ఇందుకు కారణమని స్పష్టమవుతోంది. ఈ ఘటనపై ఇప్పుడు సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు అసలు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొల్వాయి-జగిత్యాల మార్గంలో ప్రయాణికుల రద్దీ ఇంతలా ఉంటే, రవాణా శాఖ మరియు ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులను ఎందుకు ఏర్పాటు చేయడం లేదంటూ జనం నిలదీస్తున్నారు. సాధారణ రోడ్లపైనే ఓవర్‌లోడ్ ప్రయాణాలు ప్రమాదకరం కాగా, అత్యంత ప్రమాదకరమైన ఘాట్ రోడ్డుపై, గుట్ట ఎక్కే బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎలా అనుమతిస్తారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేపు ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగి ఉంటే దానికి ఎవరు బాధ్యత వహించేవారని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం హామీల వర్షం కురిపించే ప్రజాప్రతినిధులు, ప్రజల కనీస రవాణా సౌకర్యాలను ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. తీవ్రమైన ఎండలో వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, పిల్లలు గుట్టపైకి కాలినడకన నడుచుకుంటూ వెళ్తుంటే పాలకులకు కనిపించడం లేదా అని నిలదీస్తున్నారు. ఈ ప్రమాదం నుంచి ప్రయాణికులు తృటిలో తప్పించుకుని సురక్షితంగా జగిత్యాల చేరి ఉండవచ్చు కానీ, ప్రతిసారీ అదృష్టం కలిసిరాదని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి, బీర్ పూర్ ఘాట్ రోడ్డు మార్గంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు నడపాలని, ఓవర్‌లోడ్ ప్రయాణాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు.

## బిందెలతో నిరసన.. తాగునీటి కోసం తిప్పలు ?



**ఎండపల్లి, అక్టోబరు 13, ప్రజా జ్యోతి:** తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికంగా ఎన్నిసార్లు విన్నవించినా నీటి సమస్య పరిష్కారం రావడంలేదని గుల్లకోట ఎస్సీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుల్లకోటలోని ఎస్సీ కాలనీలో నీటి సరఫరా లేకపోవడంతో బిందెలతో నిరసన తెలిపారు.పాత పైపులైన్లకే కొత్త కనెక్షన్లు ఇచ్చారని, తమ కాలనీకి మిషన్ భగీరథ పైపులైన్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. తాగునీటి కోసం తీవ్ర ,ఇబ్బందులు,ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పాత వాటికి మరమ్మతులు చేసి కాలనీకి పైపులైన్ ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలని వారు కోరారు

# కొండగట్టులో వ్యర్థాల కంపు

**కుక్కల సంచారం.. ప్రయాణికులకు ముప్పు**

చికెన్ వ్యర్థాల కోసం వీధి కుక్కలు గుంపులుగా చేరే ప్రమాదం ఉంది. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అకస్మాత్తుగా కుక్కలు రోడ్డుపైకి రావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పాద యాత్ర భక్తులకు సైతం కుక్కల దాడులు, కాట్లతో రేబిస్ ముప్పు పొంచి ఉందని పేర్కొంటున్నారు.

**సెప్టిక్ వ్యర్థాలు రోడ్డుపక్కనే!**

మరుగుదొడ్ల సెప్టిక్ ట్యాంకర్ల వ్యర్థాలను సైతం అదే మార్గంలో పార బోస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పరిసరాల్లో దుర్వాసన వెదజల్లడంతో పాటు అపరిశుభ్రత నెలకొంటోంది.

**అధికారుల పర్యవేక్షణ ఏదీ?**

పుణ్యక్షేత్రానికి వెళ్లే ప్రధాన మార్గంలో ఇలాంటి పరిస్థితులు నెలకొనడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారబోస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని, బహిరంగంగా పారబోసే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ మార్గంలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి పరిశుభ్రతను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### కొండగట్టు దారిలో ఈ కంపేంటి?



దొంగలమర్రి నుంచి కొండగట్టుకు వెళ్లే మార్గంలో చికెన్, సెప్టిక్ ట్యాంకర్ వ్యర్థాలు పారబోస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. వ్యర్థాల వద్ద వీధి కుక్కలు గుంపులుగా చేరుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి, వ్యర్థాలు పారబోసేవారిపై చర్యలు తీసుకోవాలి.

-గుంటుకు అంజి... డబుల్ బెడ్ రూమ్ వాసి

## దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో మాజీ మున్సిపల్ చైర్మన్



**జగిత్యాల, అక్టోబర్ 13, ప్రజా జ్యోతి:** జగిత్యాల పట్టణంలోని గొల్లపల్లి రోడ్డులో ఉన్న ఎల్లమ్మ గుడి వద్ద వనదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారి కరుణాకటాక్షాలు భక్తులందరిపై ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తిశ్రద్ధలతో పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వనదుర్గ సేవా సమితి సభ్యులు, మహిళలు, భగవత్ బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



**గొల్లపెల్లి అక్టోబర్ 13 ప్రజాజ్యోతి :** గొల్లపల్లి మండలం రంగదాము నిపల్లె గ్రామానికి చెందిన నర్రా రాజిరెడ్డి తండ్రి మల్లారెడ్డి వయస్సు 55 సంవత్సరాలు కులం రెడ్డి గుడేటి కాపు వృత్తి వ్యవసాయం అప్పుల బాధతో మంగళవారం రోజున ఉదయం 10:00 గంటల సమయంలో తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు

# చివరి ఆయకట్టుకు నీరందేనా?

- డీ-29 కాలువ తలుపులేవీ..?
- సాగునీటి కోసం రాత్రిళ్లు రైతుల కాపలా..
- పట్టించుకోని అధికారులంటూ ఆవేదన



**మల్లాపూర్, అక్టోబర్ 13, ప్రజాజ్యోతి:**

పంటలకు నీరందాల్సిన వేళ.. చివరి ఆయకట్టు రైతులకు మాత్రం సాగునీటి గోస తప్పడం లేదు. పంటలు ఎండిపోకుండా కాలువల వెంట రాత్రింబవళ్లు కాపలా కాయాల్సిన దుస్థితి నెలకొంది. డీ-29 కాలువపై నీటి నియంత్రణ తలుపులు కనిపించకపోవడం, పైపుల వద్ద తవ్వకాలతో నీటి ప్రవాహం దారి మళ్లుతోందన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది. తమ పొలాలకు నీరం దుతుందో లేదోనన్న బెంగతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

**తలుపులు ఏమయ్యాయి?**

డీ-29 కాలువ నుంచి నీరు వెళ్లే రత్నాపూర్, కుస్తాపూర్, సిరిపూర్, చిట్టాపూర్, రాఘవపేట, నడికూడ, గోదూర్ గ్రామాల కాలువల వద్ద నీటి నియంత్రణ తలుపులు కనిపించడం లేదని రైతులు చెబుతున్నారు. అసలు ఆ తలుపులు ఏమయ్యాయి? ఎవరు తొలగించారు? వాటి స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదు? అన్న ప్రశ్నలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. మరోవైపు కాలువలకు నీరు మళ్లించే పైపుల వద్ద సిమెంట్‌ను లోతుగా తవ్వడంతో నీరు ఒకవైపే అధికంగా వెళ్లే పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

**చివరి భూములకు నీరందేనా?**

డీ-29 కాలువపై ఆధారపడే రేగుంట,గొర్రెపల్లి,వేంపల్లి,వెంకట్రావుపేట,మల్లాపూర్ ,పాత దామరాజుపల్లి,కొత్త దామరాజుపల్లి, వాల్గొండ గ్రామాల రైతులకు సాగునీటి సరఫరాపై ఆందోళన నెలకొంది. ఎగువ ప్రాంతాలకే నీరు పరిమితమైతే చివరి ఆయకట్టు భూముల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పంటల సాగు కోసం పెట్టిన పెట్టుబడి నీటి కొరతతో వృథా అవుతుందేమోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పొలాల వద్దే రాత్రి జాగారం!**

పంటలకు నీరు అందించుకునేందుకు రాత్రివేళల్లోనూ కాలువల వెంట కాపలా కాయాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.నీటి పంపిణీ విషయంలో గతంలోనూ గ్రామాల మధ్య ఘర్షణలు జరిగిన సందర్భాలున్నాయని గుర్తుచేస్తున్నారు. సాగునీరు అందాల్సిన సమయంలో నీటి కోసం రైతులు నిత్యం ఆందోళన చెందాల్సి రావడం దురదృష్టకరమని అంటున్నారు.

**ఇప్పటికైనా అధికారులు స్పందించాలి**

కాలువల వద్ద నీటి నియంత్రణ తలుపులు కనిపించకపోవడంపై విచారణ చేపట్టాలని, పైపుల వద్ద జరిగిన తవ్వకాలను పరిశీలించి నీటి ప్రవాహాన్ని క్రమబద్ధీకరించాలని రైతులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అన్నదాతలు రాత్రింబవళ్లు కాలువల వద్ద కాపలా కాయాల్సిన పరిస్థితికి ముగింపు పలికి, తమ పొలాలకు సాగునీరు అందేలా అధికారులు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

## చదువు తొమ్మిదో తరగతి వరకే.. ట్రాక్టర్ లెక్కలకు డిజిటల్ బాట

**ట్రాక్టర్ యజమానుల కోసం "ట్రాక్టర్ ఖాతా" యాప్ రూపొందించిన ఇటిక్యాల బేతి రాజు**






**రాయికల్ , అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి):** ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి వరకు చదివినప్పటికీ, పట్టుదలతో సాంకేతికతను నేర్చుకొని ట్రాక్టర్ యజమానుల కోసం "ట్రాక్టర్ ఖాతా" అనే మొబైల్ యాప్‌ను రూపొందించారు జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన బేతి రాజు . ట్రాక్టర్ యజమానులు రైతులకు చేసిన పనులు, గంటలు, ఎకరాలు, ట్రిప్పులు, లోడ్లు, చెల్లింపులు, బాకీల వివరాలను పుస్తకాల్లో రాసుకోవడంలో ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించిన ఆయన, వాటికి సులభమైన డిజిటల్ పరిష్కారంగా ఈ యాప్‌ను రూపొందించారు.

**మొబైల్ పోయినా లెక్కలు పోవు**

"ట్రాక్టర్ ఖాతా" యాప్‌లో నమోదు చేసిన రైతుల వివరాలు, పనుల లెక్కలు, చెల్లింపులు, బాకీలు, డీజిల్ మరియు ఇతర ఖర్చుల సమాచారం క్లౌడ్‌లో భద్రపరుతుంది. మొబైల్ పోయినా, పాడైనా లేదా కొత్త మొబైల్ తీసుకున్నా అదే ఫోన్ నంబర్‌తో లాగిన్ అయితే క్లౌడ్‌కు సింక్ అయిన పాత రికార్డులను తిరిగి పొందవచ్చు. ఇంటర్నెట్ అందుబాటులో లేని సమయంలోనూ యాప్‌లో లెక్కలు నమోదు చేసుకోవచ్చు. ఇంటర్నెట్ వచ్చిన తరువాత ఆ వివరాలను క్లౌడ్‌తో సింక్ చేసుకోవచ్చు. దీనివల్ల పుస్తకాలు పోవడం, పేజీలు చిరిగిపోవడం, పాత లెక్కలు మర్చిపోవడం సమస్యలు తగ్గుతాయి.

**రైతువారీ పూర్తి ఖాతా**

ఈ యాప్‌లో ప్రతి రైతుకు ప్రత్యేక ఖాతా ఉంటుంది. చేసిన పని, తేదీ, గంటలు, ఎకరాలు, ట్రిప్పులు, లోడ్లు, రేటు, మొత్తం డబ్బు, చెల్లించిన మొత్తం, ఇంకా రావాల్సిన బాకీ వంటి వివరాలను ఒకేచోట చూడవచ్చు. నగదు, ఫోన్‌పే, గూగుల్ పే, బ్యాంక్ బదిలీ, యూపీఐ, చెక్కు వంటి చెల్లింపు పద్ధతులను కూడా నమోదు చేయవచ్చు. రైతువారీ పని చరిత్ర, చెల్లింపులు, బాకీల వివరాలతో పీడీఎఫ్ తయారుచేసి అవసరమైన వారికి షేర్ చేయవచ్చు.తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో సులభమైన పదాలు, పెద్ద బటన్లతో రూపొందించిన ఈ యాప్‌ను సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువగా లేనివారు కూడా సుల భ ంగా ఉపయోగించుకోవచ్చు."ట్రాక్టర్ యజమానులు లెక్కల కోసం పుస్తకాలపై ఆధారపడకుండా, తమ మొబైల్‌లోనే పూర్తి ఖాతాను భద్రంగా నిర్వహించుకోవాలన్నదే నా లక్ష్యం. మొబైల్ మారినా వారి విలువైన రికార్డులు నష్టపోకుండా ఉండాలనే ఉద్దేశంతో క్లౌడ్ సదుపాయాన్ని అందించాం" అని రాజు బేతి తెలిపారు.ఉన్నత చదువులు, సాంకేతిక విద్య లేకపోయినా సమస్యను గుర్తించి, దానికి ఉపయోగకరమైన పరిష్కారం రూపొందించిన బేతి రాజు కృషిని స్థానికులు అభినందిస్తున్నారు.